ఈనాడు
epaper.eenadu.net

# జపాన్ పెట్టుబడులు..

# రూ.12,062 కోట్లు!

## రాష్ట్రంలో దాదాపు 30 వేల ఉద్యోగావకాశాలు

- పలు దిగ్గజ కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు
- హిరోషిమా ఉపగవర్నర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి బృందం భేటీ
- ఏడు రోజుల పర్యటన ముగించుకొని నేడు రాష్ట్రానికి..



హిరోషిమా ఉప గవర్నర్ మికా యోకోటాకు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు- హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జపాన్‌లో పర్యటించిన తెలంగాణ రైజింగ్ బృందం పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఏడు రోజుల పర్యటనలో రూ.12,062 కోట్ల పెట్టుబడులు సాధించింది. వీటి ద్వారా తెలంగాణలో యువతకు దాదాపు 30,500 ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జపాన్‌కు చెందిన మారుబెని కంపెనీ.. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది.

...మిగతా 3లో

Date : 23/04/2025 EditionName : GREATER HYDERABAD PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# జపాన్ పెట్టుబడులు.. రూ.12,062 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

రూ.1,000 కోట్లు ప్రారంభ పెట్టుబడి పెట్టనుంది. మొత్తంగా రూ.5,000 కోట్ల పెట్టుబడులకు అంచనా వేసింది. ఎన్‌టీటీ డేటా, నెయిసా సంస్థలతోనూ తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థలు రూ.10,500 కోట్ల పెట్టుబడులతో హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నాయి. తోషిబా ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ)తోనూ ఒప్పందం చేసుకోగా.. ఆ సంస్థ రూ.562 కోట్లతో రుద్రారంలో విద్యుత్ పరికరాలు, సామగ్రి తయారీ ఫ్యాక్టరీని నెలకొల్పనుంది. వీటి ద్వారా 30 వేల ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'టామ్‌కామ్'తో టెర్న్, రాజ్ గ్రూప్‌లు చేసుకున్న ఒప్పందాల ఫలితంగా.. తెలంగాణకు చెందిన 500 మందికి జపాన్‌లో ఉద్యోగ నియామకాలకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం ఈ నెల 15న రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరు మీదుగా జపాన్ పర్యటనకు వెళ్లింది. 16న టోక్యో చేరుకుని.. 22 వరకూ పర్యటించింది. ఏడు రోజుల పర్యటనలో జపాన్ పారిశ్రామికవేత్తలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించింది. మురసాకి రివర్ మ్యూజియాన్ని, ఒసాకా రివర్ ఫ్రంట్‌ను సందర్శించింది. మంగళవారం హిరోషిమా ఉపగవర్నర్‌తో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చించింది. ముఖ్యమంత్రి బృందం బుధవారం హైదరాబాద్‌కు చేరుకోనుంది. ఈ పర్యటనలో సీఎం వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ కె.రఘువీర్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఐఐసీ సీఈఓ మధుసూదన్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులున్నారు.

## అద్భుత భవిష్యత్‌ను కలిసి నిర్మిద్దాం

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో పాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు నేతృత్వంలోని తెలంగాణ అధికారుల బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రి ఫెక్చర్ (రాష్ట్ర ప్రభుత్వం) ప్రతినిధులతో సమాలోచనలు చేసింది. తొలుత హిరోషిమా డిప్యూటీ గవర్నర్ మికా యోకోటాతో సమావేశమై.. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ''హిరోషిమా ప్రభుత్వ ఆతిథ్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు. శాంతితో పాటు సాంకేతిక పురోగతిలో హిరోషిమా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించింది. తెలంగాణ కూడా కొత్త ఆవిష్కరణలు, సుస్థిర విధానాలు, శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉంది. కలిసి పనిచేద్దాం.. అద్భుత భవిష్యత్‌ను కలిసి నిర్మిద్దాం'' అని ఆకాంక్షించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణ, హిరోషిమా కలిసి పని చేయగలిగే అంశాలను ప్రతిపాదించారు. వ్యర్థాల నుంచి ఇంధనం లాంటి క్లీన్ టెక్నాలజీ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల ప్రాసెసింగ్, మురుగునీటి శుద్ధి, పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులు, అర్బన్ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విపత్తుల నివారణ డిజైన్లు, భూగర్భ మెట్రో ఇంజినీరింగ్, హిరోషిమా-తెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్ తదితర ప్రతిపాదనలను ప్రస్తావించారు.



హిరోషిమా అసెంబ్లీలో శాసనసభ్యులనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

## హిరోషిమా అసెంబ్లీ సందర్శన

సీఎం బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రి ఫెక్చరల్ అసెంబ్లీ హాల్‌ను సందర్శించింది. తెలంగాణ బృందాన్ని అసెంబ్లీ స్పీకర్ తకాషి నకమోటో, శాసనసభ్యులు ఘనంగా స్వాగతించారు. వారిని ఉద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "హిరోషిమాకు రావటం గౌరవంగా ఉంది. హిరోషిమా.. ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించిన నగరం. దీని మాదిరిగానే ప్రజల ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ" అని తెలిపారు. శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని హిరోషిమా ప్రభుత్వానికి మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. తర్వాత తెలంగాణ బృందం.. హిరోషిమా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమైంది. తర్వాత హిరోషిమాలోని గాంధీ మెమోరియల్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా ఇద్దరు తెలుగు విద్యార్థినులు హాసిని, హరిణి తాము గీసిన రేవంత్‌రెడ్డి చిత్రపటాలను ఆయనకు అందజేశారు. వారిద్దరూ 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని ఆలపించగా.. సీఎం అభినందించారు. అనంతరం హిరోషిమా శాంతి స్మారక ఉద్యానవనంలో రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పుష్పాంజలి ఘటించారు. అణుబాంబు దాడికి తట్టుకొని నగరంలో మిగిలిన ఏకైక నిర్మాణం డోమ్‌ను సందర్శించారు.



హిరోషిమాలోని చారిత్రక 'అణుబాంబు డోమ్'ను స్థానిక ప్రతినిధితో కలిసి సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు